
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3, కనిష్ఠం 23.2
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
ఆదివారం 21 జూలై 2024





ఇంద్రవెల్లి మండలం గౌరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో సీతబట్ట వాగులో వరదనీటిని దాటుతున్న గ్రామస్థులు



తలమడుగు సమీపంలో ప్రమాదకరంగా కనిపిస్తున్న లోలెవల్ వంతెన (ఫైల్)



ఇంద్రవెల్లి మండలం వడ్గాం గ్రామ పంచాయతీ పరిధిలో జైత్రంతండాకు వెళ్లే రోడ్డు



సిరికొండ నుంచి జెండాగూడ గ్రామానికి వెళ్లే దారి ఇలా

వరదొస్తే.. వణుకే!!

- జిల్లాలో చిన్నపాటి వర్షాలకే గిరిజన గ్రామాలకు రాకపోకలు బంద్
- రవాణా సౌకర్యం లేక అత్యవసర సమయంలో ఇక అంతేసంగతి!!
- రోడ్డు మార్గాలు తెగిపోవడంతో బాహ్య ప్రపంచానికి దూరమవుతున్న ఆదివాసీలు
- ఏళ్లు గడుస్తున్నా.. అభివృద్ధికి నోచుకోని మారుమూల గ్రామాలు
- చోద్యం చూస్తున్న ఐటీడీఏ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు
- గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు
- జిల్లావ్యాప్తంగా 468 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 1,257 అనుబంధ గిరిజన తండాలు, గూడెలు

ఆదిలాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాలకు వరదొచ్చిందంటే చాలు వణుకు మొదలవుతుంది. చిన్నపాటి వర్షాలకే వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. పగలు అష్టకష్టాలు పడి వాగులను దాటుతున్నా.. రాత్రి వేళల్లో మాత్రం నరకయాతన పడాల్సి వస్తుందని మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలంలో ఊరుదాటి వెళ్లే పరిస్థితి లేక సీజనల్ వ్యాధుల భారీన పడి ఏటా ఎంతో మంది గిరిజనుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. అత్యవసర సమయంలో కూడా వైద్యం అందే పరిస్థితులు కనిపించడం లేదు. పలు గ్రామాలకు రోడ్డు మార్గాలు తెగిపోవడం తో బాహ్య ప్రపంచానికి దూరమవుతున్నారు. ఇప్పుడిప్పుడే గిరిజనులకు ఆధునీక వైద్యంపై నమ్మకం కుదురుతున్న అందుబాటులో రవాణా మార్గాలు, సమాచార వ్యవస్థ లేకపోవడంతో పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లాలో 468 గ్రామ పంచాయతీల పరిధిలో 1,257 అనుబంధ గిరిజన తండాలు, గూడెలు ఉన్నాయి. జిల్లాలో సుమారుగా 7 లక్షల జనాభా ఉండగా.. అందులో 5 లక్షలకు పైగా జనాభా గ్రామీణ ప్రాంతాలలోనే నివసిస్తున్నారు. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతమైన ఉట్నూర్, సిరికొండ, నార్నూర్, ఇంద్రవెల్లి, బజార్‌హత్నూర్, గాదిగూడ, బేల మండలాల్లోని గిరిజన గ్రామాల్లో పరిస్థితులు మరీ అధ్వానంగా కనిపిస్తున్నాయి. వరదలకు రవాణా వ్యవస్థ పూర్తిగా స్థంభించి పోవడంతో వైద్య సేవలు అందని ద్రాక్షగానే మారుతున్నాయి. అయినా ఐటీడీఏ అధికారులు, ప్రజాప్రతినిధులు తేలికగానే తీసుకోవడంతో గిరిజనుల పాలిట శాపంగా మారింది.

అత్యవసరంలో దేవుడే దిక్కు

వర్షాకాలం సీజన్ ప్రారంభమైనా.. అధికార యంత్రాంగం అప్రమత్తమైనట్లు కనిపించడం లేదు. ప్రస్తుతం జిల్లాలో భారీవర్షాలు కురవడంతో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా గర్భిణుల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. జిల్లాలో 7బర్త్ వెయిటింగ్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. కానీ ఆదివాసీ గిరిజనులు సంస్కృతీ, సంప్రదాయాలు, కట్టుబాట్లతో బర్త్ వెయిటింగ్ రూమ్‌లకు వచ్చేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తుంది. వైద్యాధికారులు ఇప్పటికే కొంతమందిని బలవంతంగా ముందస్తుగా తరలిస్తున్నా.. చాలామంది ఇంటికే పరిమితమవుతున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా మారుమూల గిరిజన గ్రామాలను విష జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. దీంతో స్థానికంగా అందుబాటులో ఉన్న నాటు వైద్యాన్నే నమ్ముకుంటున్నారు. వైద్యం వికటించడంతో ప్రమాదాల బారీన పడి ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. ఏదైనా అత్యవసరమైతే దేవుడే దిక్కంటూ భారం వేస్తున్నారు.

ప్రమాదమని తెలిసినా..

జిల్లాలోని పలు మారుమూల గ్రామాలకు వెళ్లాలంటే వాగులు, వంకలను దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇదంతా ప్రమాదమని తెలిసినా ప్రయాణం తప్పడం లేదంటున్నారు. ఏళ్ల తరబడి ఎన్నో సమస్యలతో గిరిజనులు సహవాసం చేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా ఏజెన్సీ మారుమూల ప్రాంతమే కావడంతో ఇప్పటికీ కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. బజార్‌హత్నూర్ మండలంలోని మోర్కాండి గ్రామం వద్ద లోలెవల్ వంతెన పొంగి ప్రవహించడంతో దాటి వెళ్లే పరిస్థితి లేదని ఆ గ్రామస్థులు చెబుతున్నారు. తలమడుగు మండల కేంద్రం సమీపంలో ఉన్న లోలెవల్ వంతెనతో పాటు ఇంద్రవెల్లి మండలంలో వడ్గావ్ గ్రామ పంచాయతీ పరిధిలోని జెండాగూడ, జైత్రం తండా, గౌరపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సీతబట్ట, హర్కపూర్, అందుగూడ, మామిడిగూడ (బి) మామిడిగూడ(జి), సిరికొండ మండలంలోని ఫకీర్ నాయక్ తండా, బీంపూర్, వాయిపేట్, కుంటగూడ, రాజులగూడ, జెండాగూడ, బుర్సిగుట్ట, నిజాంగూడ, ధర్మసాగర్, గోకుల్‌నగర్‌తో పాటు తదితర గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంలు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే సిరికొండ మండల కేంద్రం నుంచి ఇంద్రవెల్లి మండలానికి వెళ్లే మార్గంలో కొండాపూర్ గ్రామ సమీపంలోని చిక్‌మాన్ వాగుపై నిర్మిస్తున్న వంతెన అసంపూర్తిగానే కనిపిస్తుంది. దీంతో అవస్థలు తప్పడం లేదంటున్నారు. భీంపూర్ మండలంలో గుబిడి, కొజ్జన్‌గూడ, గుబిడిపల్లి, జల్‌కోరి, రాజులకోరి, చింతపల్లి ఇలా చాలా గ్రామాలకు వరద నీటి ప్రవాహంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

వానొస్తే.. రాకపోకలు బంద్

జిల్లాలోని చాలా మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు రవాణా సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికీ ఎర్ర బస్సంటే ఎరుగని వారు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. అత్యవసర సమయంలో కూడా ఎడ్లబండి, కాలినడకతోనే ప్రయాణం చేయాల్సి వస్తుంది. మార్గమధ్యంలో ఉన్న వాగులు, వంకలు పొంగి పొర్లడంతో రోజుల తరబడి బాహ్య ప్రపంచానికి దూరమవుతున్నారు. ఎత్తైన కొండలు, లోయల్లో నివసించడంతో సమాచారం చేరవేసేందుకు కూడా కష్టంగానే మారింది. ఇప్పటికీ పలు గిరిజన గ్రామాల్లో నెట్‌వర్క్ సిగ్నల్స్ ఉండవు. కనీసం 108 వాహనానికి సమాచారం అందించే అవకాశం లేదు. గర్భిణులను ఆసుపత్రి లో చేర్పి సుఖప్రసవం అయ్యేందుకు మారుమూల గిరిజన ప్రాంతాలలో అవ్వాల్ అంబులెన్స్ సేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. కానీ సమాచారం, రవాణా మార్గం లేక పూర్తిస్థాయిలో అవ్వాల్ సేవలు అందక స్థానిక ప్రసవంతో మాతాశిశు మరణాలు పెరిగిపోతూనే ఉన్నాయి. అంతేకాకుండా ఇటీవల ఇచ్చోడ, ఇంద్రవెల్లి మండలాలకు చెందిన పలువురు గర్భిణులను ఎడ్లబండ్లలోనే ఆసుపత్రికి తరలించిన పరిస్థితులు ఎదురయ్యాయి.

వానాకాలంలో గోస తప్పడం లేదు

: మంద ప్రమోద్, ధనోర గ్రామం, భీంపూర్ మండలం



వానాకాలం వచ్చిందంటే చాలు గోసతప్పడం లేదు. జిల్లాకేంద్రం నుంచి ధనోరా గ్రామానికి రావాలంటే మూడు లోలెవల్ వంతెనలను దాటాల్సివస్తుంది. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురిస్తే సావర్గాం, పిప్పల్‌కోటి మధ్యలో నిపాని వద్ద ఉన్న వంతెనలపై వరదనీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో రోజుల తరబడి బయటకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. ఏదైనా అత్యవసరమైతే ప్రాణాలకు తెగించి మరీ ప్రయాణం చేయాల్సి వస్తుంది.

కుంటాల జలపాతానికి జలకళ

నేరడిగొండ, జూలై 20: జిల్లావ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలపాతాలు జలకళ సంతరించుకున్నాయి. ఇందులో భాగంగా ఎగువన ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి నేరడిగొండ మండలంలోని ప్రసిద్ధి గాంచిన కుంటాల జలపాతం పరవళ్లు తొక్కుతుంది. పెద్ద శబ్దాలతో జాలు వారుతున్న నీటిని చూసి స్థానికులు, పర్యాటకులు మంత్రముగ్ధులవుతున్నారు. రాష్ట్రంలో ఎత్తైన జలపాతాలలో కుంటాల జలపాతం ఒకటి.

● పొచ్చెర జలపాతానికి అనుమతి లేదు

భోథ్: మండలంలోని పొచ్చెర వెళ్లేందుకు అనుమతి లేదని అటవీ శాఖ అధికారులు శనివారం ఉదయం కంచెను ఏర్పాటు చేశారు. భారీ వర్షాల కారణంగా జలపాతం వద్ద సందర్శకుల తాకిడి పెరిగి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నందున ముందస్తుగా ఈ చర్యలు తీసుకున్నారు. మరోవైపు జలపాతం వద్ద అటవీ శాఖ సిబ్బంది సైతం సందర్శకులు రాకుండా అటు వైపు వెళ్లకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు.



పరవళ్లు తొక్కుతున్న కుంటాల జలపాతం



జలపాతానికి వెళ్లే దారిలో ముళ్ల కంచె ఏర్పాటు చేసిన అటవీ శాఖ

ఉప్పొంగిన వాగు.. ఊరికి తప్పని ఆపద!

నేరడగొండ, జూలై 20: వానొస్తే.. ఆ గ్రామానికి ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని సేవ్‌దాస్‌నగర్ గ్రామానికి వెళ్లే దారిలో వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో ఆ గ్రామస్థుల ఇబ్బందులు వర్ణణాతీతం.



సేవ్‌దాస్‌నగర్ వాగును ప్రమాదకరంగా దాటుతున్న గ్రామస్థులు

కాగా, శనివారం ఉదయం వేళ నేరడిగొండకు వారసంతకు వెళ్లిన యువకులు సాయంత్రం వేళ తిరుగు ప్రయాణంలో వాగును దాటేందుకు పడరాని పాట్లు పడ్డారు. ప్రాణాలకు తెగించి పలువురు యువకులు వాగు దాటి తమ గ్రామానికి చేరుకున్నారు. అయితే, డిసెంబరు వరకు ఇలాగే ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా వాగు ఉప్పొంగి ప్రవహించిన సమయంలో బయటకు రాని పరిస్థితి నెలకొంటుందని పేర్కొంటున్నారు. గ్రామంలో 45కుటుంబాలు, 250 జనాభా జీవనం సాగిస్తుందని తెలిపారు. అత్యవసర సమయంలో అవస్థలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టేల చూడాలని కోరుతున్నారు.

● రోగం వస్తే ఇబ్బందులే.. : చౌహాన్ కాశీబాయి, స్థానిక మహిళ



వర్షాకాలం వస్తే మా ఇబ్బందులు ఎవరికి చెప్పుకోలేని పరిస్థితి ఉంది. రోగం వస్తే ఈ వాగు దాటేందుకు అవస్థలు పడుతున్నాం.దీంతో గ్రామస్థులు వర్షాకాలం వచ్చిందంటే బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించాల్సి వస్తుంది.

సంక్షిప్త సమాచారం

నేడు తండాల్లో గురుపౌర్ణిమ వేడుకలు

ఉట్నూర్, జూలై 20: ఉమ్మడి జిల్లాలోని లంబాడి తండాల్లో ఆదివారం గురుపౌర్ణిమ వేడుకలను నిర్వహించుకోవాలని తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ చంద్రకాంత్ నాయక్ పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం తండా తండాల్లో గురుపూజ కార్యక్రమం నిర్వహించాలని పేర్కొన్నారు. అలాగే ఉదయం 9గంటలకు భోగ్ బండార్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నాయక్, కార్భారీ, డావ్ గ్రామస్థులు లంబాడీల మహిళలు ఉద్యోగ కార్మిక నాయకులు గ్రామపెద్దలు సకాలంలో పూజా భోగ్‌బండార్ చేసి రామారావు మహరాజ్ చిత్రపటానికి పూజలు చేసి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

31న వస్తువుల వేలం

ఆదిలాబాద్ అర్బన్, జూలై 20: ఈనెల 31న జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో వస్తువుల వేలం వేయనున్నట్లు బుధవారం జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సర్వీస్‌లో లేని కంప్యూటర్స్, ప్రింటర్స్, కిట్ ఆర్టికల్స్, పాతబడిన బెంట్లు, ఇనుప సామగ్రి, స్టోర్ వస్తువులను విక్రయించేందుకు వేలం నిర్వహించనున్నట్లు ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ వేలంలో పాల్గొనే ఆసక్తి గల కొనుగోలుదారులు ఈ నెల 31న ఉదయం 10గంటలకు జిల్లా ఏఆర్ పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు ఆధార్‌కార్డుతో రావాలని ఎస్పీ పేర్కొన్నారు. ఇతర సమాచారం కోసం ఆర్ఐ అడ్మిన్ ఏ.నవీన్(ఆర్ఐ స్టోర్స్)ను సెల్ నెం. 8712659933 ద్వారా సంప్రదించాలని ఎస్పీ పేర్కొన్నారు.

32 మంది అటెండర్ల బదిలీ

బోథ్, జూలై 20: జిల్లాలోని వివిధ పాఠశాలలు, ఎంపీడీవో కార్యాలయాలలో పని చేస్తున్న 32 మంది అటెండర్లు బదిలీ అయ్యారు. సుదీర్ఘకాలంగా వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న అటెండర్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సైతం బదిలీ అయ్యారు. బోథ్ మండల పరిషత్ కార్యాలయం నుంచి ముగ్గురు ఉద్యోగులు బదిలీ కావడం జరిగింది.

అత్యవసర సమయాల్లో తప్ప బయటకు రావొద్దు

- ● ప్రజలకు ఎస్పీ గౌస్‌ఆలం పలు సూచనలు ● జిల్లాకు రెండు రోజుల పాటు భారీ వర్ష సూచన ● రెడ్ అలర్ట్ ప్రకటించిన వాతావరణ శాఖ



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం

ఆదిలాబాద్ అర్బన్, జూలై 20: ప్రజలు అత్యవసర సమయాలలో తప్ప బయటకి రావద్దని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు. రాష్ట్ర వాతావరణ శాఖ రెండు రోజుల పాటు జిల్లాకు భారీ వర్షాలు (రెడ్‌అలర్ట్) సూచించిన దృష్ట్యా జిల్లా ప్రజలకు ఎటువంటి ప్రమాదం తలెత్తకుండా జిల్లా ఎస్పీ సూచనల మేరకు జిల్లా యంత్రాంగం విధులను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రత్యేక టెలికాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి జిల్లా పోలీసు అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అత్యవసర సమయాలలో తప్ప బయటకు రావద్దని సూచించారు. ఎటువంటి సమస్యలు ఉన్న అత్యవసర సమయంలో డయల్ 100కు లేదా జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 24గంటలు అత్యవసర సమయంలో స్పందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారని, ప్రజలు 08732-226246, 8712659906 సంప్రదించాలని లేదా స్థానిక పోలీసు స్టేషన్‌కి సమాచారం అందించాలని సూచించారు. నూతనంగా శిక్షణ తీసుకున్న డీడీఆర్ఎఫ్ బృందం జిల్లాలో 24గంటలు అందుబాటులో ఉంటుందని, ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరుగకుండా కాపాడతారని తెలిపారు. జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని పోలీసు స్టేషన్లలో అప్రమత్తతో ఉంటుందన్నారు. భారీ వర్షాలు పడి వరదలు సంభవించినప్పుడు కల్వర్టలో, బ్రిడ్జిలను గమనిస్తూ ఉండాలని, బ్రిడ్జిల పై నుంచి నీరు ప్రవహించే సమయాలలో ప్రజలు వాటిని దాటకుండా ఉండాలని సూచించారు. జలాశయాలు, చెరువులు, వాగుల వద్ద మత్స్యకారులు, ప్రజలు చేపల వేటకు వెళ్లకూడదన్నారు. వర్షం భారీగా ఉన్నప్పుడు పొలాలలో రైతులు విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలని, విద్యుత్ స్థంబాలను, వైర్లను చేతులతో తాకవద్దని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, పిల్లలు పాత భవనాలలో ఉండకుండా చూడాలని తెలిపారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలోని చెరువులు, కుంటలు, అలుగుల వద్ద, ప్రధాన రహదారులపై ప్రవహించే వాగులు, వంకలు నీటి ప్రవాహం స్థితిగతులపై ముందస్తు సమాచారం తెలుసుకొని ప్రత్యక్షంగా వెళ్లి పోలీసు అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. పలు జాగ్రత్తలు తీసుకుని ప్రజల రాకపోకలను గమనించాలని ఆయన పేర్కొన్నారు.



సుంకిడి భీమన్న వాగు లోలెవల్ వంతెన వద్ద పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజమోహన్

ఇచ్చోడ: మూడు రోజుల భారీ వర్ష సూచన నేపథ్యంలో ఇచ్చోడ పోలీసు సర్కిల్ పరిధిలోని పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ భీమేష్ సూచించారు. శనివారం మండలంలోని పలు ప్రాంతాల్లో పరిశీలించిన ఆయన లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలన్నారు. పోలీసు సిబ్బంది ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రమాదకరంగా పొంగుతున్న వాగుల చెంతకు వెళ్లవద్దని సూచించారుజ వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, మేకల కాపరులు, చేపల వేటకు వెళ్లే వారు ఆకస్మాత్తుగా వచ్చే వరదల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొంగే వాగులు దాటే ప్రయత్నం చేయొదన్నారు.

తలమడుగు: భారీ వర్షాల నేపథ్యంలో లో లెవల్ వంతెనల వద్ద ప్రయాణికులు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. శనివారం మండలంలోని సుంకిడి భీమన్న వాగును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా లో లెవల్ వంతెనలు దాటుతున్నప్పుడు వరద ప్రభావం ఎక్కువ వస్తుందని, అలాంటి సమయంలో వాహనదారులు, వంతెనలు దాటవద్దన్నారు. అదే విధంగా గ్రామాల్లో పురాతనమైన ఇండ్లలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ స్తంభాలను తాకవద్దని సూచించారు. భారీ వర్షాలతో ఎలాంటి నష్టం జరిగిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు. కాగా భీమన్నవాగు వద్ద పైప్‌లైన్, చెత్తాచెదారం నిండిపోవడంతో వెంటనే శుభ్రపరచాలని పంచాయతీ అధికారులకు ఆదేశించారు.

అలాగే, తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నారాయణ సూచించారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల నిమిత్తం వాహనదారులు వాగులు వంకలు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అంతేకాకుండా ముఖ్యంగా విద్యుత్ స్తంభాల వద్ద జాగ్రత్తగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. జాలర్లు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకున్న వెంటనే అధికారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలో గత రెండు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాని ఎస్సై నరేష్ ప్రజలకు శనివారం ఒక ప్రకటనలో సూచించారు. రైతులు పొలాల వద్ద కరెంటుకు దూరంగ ఉండాలన్నారు. జలపాతాల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏదైనా ప్రమాదాలు సంభవించిన 100కు సమాచారం అందించాలని ఎస్సై పేర్కొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్

రుణమాఫీలో గందరగోళాన్ని తొలగించాలి

● ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లక్ష లోపు రుణమాఫీలో గందరగోళాన్ని తొలగించి రైతులను ఆదుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలుగానే మారాయన్నారు. ఏకకాలంలోనే 2లక్షల రుణమాఫీ రైతులందరికీ వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రణాళికబద్ధంగా కాకుండా అడ్డగోలుగా రుణమాఫీ జాబితాను విడుదల చేయడంతో రైతులు గందరగోళ పరిస్థితికి గురవుతున్నారని అన్నారు. రైతుల అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. అర్హత ఉన్న ఇప్పటి వరకు ఎందరో మంది రైతులకు రుణమాఫీ వర్తించడం లేదన్నారు. వెంటనే అధికారులు జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు ఆయా మండల కేంద్రాలలో హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. తలమడుగు మండలానికి చెందిన రైతు దాసరి అశోక్‌కు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదన్నారు. అలాగే తొడసం దృపదబాయి అనే రైతు లక్షా 63వేలు పంట రుణం తీసుకుంటే కేవలం రూ.39వేలే మాఫీ అయ్యిందన్నారు. అలాగే జూకంటి సృజన్ లక్షా 38వేలు రుణం తీసుకుంటే కేవలం రూ.85వేల 420 మాఫీకావడం ఏమిటని ప్రశ్నించారు. ఇలా జిల్లాలో చాలా మంది రైతులు రుణమాఫీ వర్తించక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో దయాకర్, ఆధినాథ్, ఆకుల ప్రవీణ్, మయూరిచంద్ర, దినేష్ మటోలియా, కృష్ణయాదవ్, రాజేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక మోసాలను గమనిస్తున్న రైతాంగం

● మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ అర్బన్, జూలై 20: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రైతు వ్యతిరేక మోసాలను యావత్ రైతాంగం గమనిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా కింద అందించాల్సిన పెట్టుబడి సహాయాన్ని రుణమాఫికి మళ్లించి రాష్ట్ర రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. రుణమాఫీ ప్రక్రియలోను అనేక మంది రైతులకు న్యాయం జరగడం లేదని, రాష్ట్ర ప్రభుత్వ విధి విధానాల పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రైతుభరోసా పెట్టుబడి సహాయం గురించి ప్రజాభిప్రాయ సేకరణ పేరిట ప్రభుత్వం కాలయాపన చేస్తూ ఆ నగదునే రుణమాఫీ కింద చెల్లించిందన్నారు. అన్నదాతల సంక్షేమానికి దాదాపు పదేండ్ల కాలంలో దాదాపు 11లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేసిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని స్పష్టం చేశారు. ఒకే దఫాలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తుతం కాలయాపన చేయడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. ఇందులో రోకండ్ల రమేష్, మెట్టు ప్రహ్లాద్, ఇజ్జగిరి నారాయణ, గంద్రత్‌రమేష్, మార్శెట్టి గోవర్ధన్, సేవ్వాజగదీశ్, నవాతే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

సీఆర్ఆర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటాం

● డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, జూలై 20: సీఆర్ఆర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటామని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శనివారం సీఆర్ఆర్ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని ప్రజాసేవ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, మంత్రిగా జిల్లాకు ఎనలేని సేవలందించిన మహనీయుడు దివంగత చిల్కూరి రామచంద్రారెడ్డి అని కొనియాడారు. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందాలనే ఉద్దేశ్యంతో రిమ్స్ ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. నియోజక వర్గంలోనేకాకుండా జిల్లాలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు ఇంటి స్థలాలు అందించిన ఘనత మాజీమంత్రి సీఆర్ఆర్‌కే దక్కుతుందన్నారు. ఇందులో మాజీ ము న్సిపల్ చైర్మన్ దిగంబర్‌రావు పాటిల్, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెలనర్సింగ్, కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్, కౌన్సిలర్లు రామ్ కుమార్, జాఫర్ అహ్మద్, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ ఇజ్జగిరి సంజయ్ కుమార్, బిక్కి గంగాధర్, ముడుపు ప్రశాంత్‌రెడ్డి, ఎం.ఏ.షకీల్, డేరాకృష్ణారెడ్డి, అల్లూరి భూమారెడ్డి, తిప్పిరెడ్డి విఠల్, మహిళ నాయకురాలు శ్రీలేఖ, లత తదితరులున్నారు.


సీఆర్ఆర్ చిత్రపటం వద్ద పూలమాల వేస్తున్న నాయకులు



బ్లాక్ బోర్డు ఇలా.. చదువులు సాగేదెలా?

● షెటర్ గదుల్లోనే కొనసాగుతున్న తరగతులు

● అధ్వానంగా ఇచ్చోడ జ్యోతిబా పూలే బీసీ గురుకులం

ఆదిలాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బీసీ గురుకులాల పరిస్థితి మరి అధ్వానంగా మారింది. ఆదిలాబాద్ జిల్లాలో 7 జ్యోతిబాపూలే (ఎంజేపీ) గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశారు. ఇందులో ఇచ్చోడ మండలం నర్సాపూర్ గ్రామానికి మంజూరైన జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనం లేదు. దీంతో గత నాలుగైదేళ్లుగా ఇచ్చోడ మండల కేంద్రంలోని అద్దె భవనంలోనే తరగతులను కొనసాగిస్తున్నారు. ఈ పాఠశాలలో 5 నుంచి 10 వరకు తరగతులు కొనసాగుతున్నాయి. అయితే తరగతి గదుల్లో కనీస వసతులు లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. పూర్తిగా ధ్వంసమై పోయిన బ్లాక్‌బోర్డు పై పాఠాలు నేర్చుకోవడం ఇక్కడి విద్యార్థులకు పెద్ద సమస్యగానే మారింది. అసలే వర్షాకాలం కావడంతో ఇరుకు గదుల్లో చదువుకోవడం ఇబ్బందికరంగా మారుతుంది. తరగతి గదుల కొరత తీవ్రంగా ఉండడంతో రోడ్డును ఆనుకుని ఉన్న అద్దె షెటర్ రూముల్లోనే తరగతులను కొనసాగిస్తున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన అసలు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.


తరగతి గదిలో ధ్వంసమైన బ్లాక్ బోర్డు








తలమడుగు పంచాయతీలో రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఫణీందర్

పారిశుధ్య నిర్మూలనపై నిర్లక్ష్యం వహించొద్దు


● డీఎల్‌పీవో ఫణీంధర్

తలమడుగు, జూలై 20: భారీ వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్య నిర్మూలనపై నిర్లక్ష్యం వహించవద్దని డీఎల్‌పీవో ఫణీందర్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్మూలన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పారిశుధ్యం లోపించడం వల్ల పలు అంటూ వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. అంతేకాకుండా రోడ్లపై చెత్తాచెదారం, మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. రోడ్లపై ప్లాస్టిక్ కవర్లు ఎవరైనా వేస్తే వారికి జరిమానా విధించాలన్నారు. అనంతరం గ్రామ పంచాయితీకి సంబంధించిన రిజిష్టర్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా హరితహారం మొక్కల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటింటికి పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో వినోద్‌కుమార్, పంచాయితీ సెక్రటరీ అశోక్, కారోబార్ కృష్ణయ్య, పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగపూర్ వంతెన వద్ద ట్రాఫిక్ జామ్

ఉట్నూర్, జూలై 20: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు ఉట్నూర్ మండలంలోని నాగపూర్ వంతెన వద్ద చెట్టు విరిగి 33కేవీ విద్యుత్‌లైన్ పై పడడంతో ఉట్నూర్, ఆదిలాబాద్ రోడ్డు పై ట్రాఫిక్ జాం ఏర్పాడింది. సాయంత్రం ఐదు గంటల నుంచి 6గంటల వరకు ట్రాఫిక్ నిలిచి పోయింది. కరెంట్ తీగలు రోడ్డు పై పడిపోవడంతో నాగపూర్‌కు చెందిన ప్రజలు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించి కరెంట్ సరఫరాను నిలుపుదల చేయించారు. అనంతరం ఇప్ప మధుకర్ ఆధ్వర్యంలో చెట్టుకొమ్మలను తీగలపై నుంచి తొలగించడంతో పాటు రోడ్డు పై పడిన తీగలను తొలగించి ట్రాఫిక్ పునరుద్ధరించేలా యువకులు కృషి చేశారు. మండంలోని నాగపూర్‌వాగు, మత్తడివాగు, శ్యాంపూర్‌వాగు, పులిమడుగు వాగు, దంతన్‌పల్లి వాగు, వంక తుమ్మవాడు, పేరుకగూడెం వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వాగు పరివాహక ప్రాంతాలలో పంట భూముల్లో నీళ్లు చేరి రైతులు ఆందోళన చెందుతున్నారు.






న్యాయవిజ్ఞాన సదస్సు కరపత్రాలను చూపుతున్న న్యాయవాదులు

విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు

బజార్‌హత్నూర్, జూలై 20: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సును న్యాయవాదులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు న్యాయచట్టాలపై అవగాహన, లోక్‌అదాలత్, ఈవ్‌టీజింగ్, వాయిలెన్సు, వంటి విషయాల గురించి వివరించారు. సమాజంలో సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే కోర్టుల ద్వారా తగిన శిక్షలు వేసి మళ్లీ సమాజంలో ఏ తప్పులు చేయకుండా వారిని న్యాయస్థానాలు తీర్చిదిద్దుతాయని తెలిపారు. మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల బంగారు భవిశ్యత్తును నాశనం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

పేదల సంక్షేమమే ధ్యేయంగా కృషి

● త్వరలో తులం బంగారం అందజేస్తాం : ఎమ్మెల్యే బొజ్జు

ఇంద్రవెల్లి, జూలై 20: పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం వరమని, పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 16 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని, గతంలో వరంగల్ డిక్లరేషన్ సభలో ఏఐసీసీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం నేడు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రూ.లక్ష లోపు గల రుణాన్ని మాఫీ చేసిందని తెలిపారు. రైతుల గురించి ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. త్వరలో రూ.లక్షతో పాటు తులం బంగారం అందజేస్తామని తెలిపారు. వర్షకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీన్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఆర్ఐ మెస్రం లక్ష్మణ్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, ఎం.డి.మసూద్, సోమోరే నాగోరావు, సోన్ కాంబ్లే జితేందర్, తదితరులు పాల్గొన్నారు.

● 'మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి'

ఇంద్రవెల్లి: ఈ పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో హెల్ప్ విల్ పౌండేషన్, న్యాక్ వారి సహకారంతో లేబర్ కార్డు కలిగి ఉండి, శిక్షణ పొందిన యువతులకు ఉచిత కుట్టు మిషన్‌లతో పాటు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ముందుగా మహనీయుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ప్రతి రంగంలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

'సమస్యల పరిష్కారం కోసమే ఫోన్‌ఇన్'

ఉట్నూర్, జూలై 20: ఖానాపూర్ నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా ప్రజల నుంచే తెలుసుకుని ఆ సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ శనివారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి భారీ స్పందన వచ్చింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ఈ కార్యక్రమం అని అన్నారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి వివిధ గ్రామాలకు చెందిన గ్రామస్థులు, ఉద్యోగులు వందలాది మంది ఫోన్ ద్వారా ఎమ్మెల్యేతో మాట్లాడి తాము ఎదుర్కొంటున్న నీటి, రోడ్డు, డ్రైనేజీ, కరెంట్, భూమికి సంబంధించిన సమస్యలతో పాటు ఏజెన్సీలో మెగా డీఎస్సీ, పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి ఆయా గ్రామాల ప్రజలు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యలను సీఎం, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖానాపూర్ నియోజక వర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఫోన్‌ఇన్, పొద్దుపొడుపు, బొజ్జన్న అడుగు, మార్నింగ్‌వాక్, పల్లెబాట లాంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు.

మహిళా క్యాంటీన్‌ల ఏర్పాట్లు పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ రాజార్షిషా ● మహిళా శక్తి క్యాంటీన్, పౌల్ట్రీలపై సమైఖ్య సభ్యులతో సమావేశం ● పాల్గొన్న జిల్లా అధికారులు



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ అర్బన్, జూలై 20: జిల్లాలో ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌లను, పౌల్ట్రీల ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజార్షిషా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మహిళశక్తి క్యాంటిన్, పౌల్ట్రీలపై జిల్లా సమైక్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ మహిళ సంఘాల ద్వారా మహిళలను ఐదేళ్లలో కోటి మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కాగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా చేరుకుని జిల్లాలోని మహిళలు లక్ష్యాన్ని అధిగమించి జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. మైక్రో ఎంటర్ ప్రైజెస్, మీ సేవా కేంద్రాలు, స్టిచింగ్, మహిళశక్తి క్యాంటిన్ గురించి మహిళ సమైక్య సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. పౌల్ట్రీ మదర్ యూనిట్లు వివరాల పై సమీక్షించారు. జిల్లా, మండల, గ్రామాల వారీగా మహిళ సమైఖ్య సంఘాల గ్రూప్‌లను ఎక్కువగా ఏర్పాటు చేయాలన్నారు. మహిళ శక్తి క్యాంటిన్‌ల ఏర్పాట్లు పారదర్శకంగా ఉండాలని ఆదిలాబాద్, ఉట్నూర్, ఇచ్చోడ, బోథ్‌లలో ఏర్పాటు చేయాలని తెలిపారు. అందుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. మొబైల్ హోటల్స్, బస్టాండ్ సమీపంలో జనాలు ఎక్కువగా రద్దీ ఉన్న చోట గుర్తించి క్యాంటిన్‌లు ఏర్పాటు చేసుకుని మంచి నాణ్యతతో కూడిన ఆహారం తయారు చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న నిర్మాణ పనులను, ప్రతి మూడవ శనివారం తల్లిదండ్రులతో సమావేశాలు, తదితర అంశాలపై అమ్మ ఆదర్శ పాశాల కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో సాయన్న, డీపీఎం, ఏపీఎం, మహిళా సమైఖ్య సంఘాల సభ్యులు, తదితరు లు పాల్గొన్నారు.

● అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్‌లోని దస్నాపూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతి శనివారం నిర్వహించే ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలను వేయాలన్నారు. రిజిస్ట్రేషన్‌ను సక్రమంగా మెయింటెన్ చేయాలన్నారు. అలాగే గర్భిణుల విషయంలో పలు సూచనలు చేశారు. ఇందులో జిల్లా వైద్యాధికారి నరేందర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో నరేందర్, సాధన, సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీ డబ్బులు

తక్కువ వచ్చాయి.. న్యాయం చేయండి!!

● ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయ అధికారికి రైతుల ఫిర్యాదు ● తమకు మొత్తానికే రుణమాఫీ రాలేదన్న మరికొందరు రైతులు ● ఆందోళన చెందొద్దు.. అందరికీ రుణ మాఫీ జరిగేలా చర్యలు : జిల్లా వ్యవసాయ అధికారి



జిల్లా వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేస్తున్న రైతులు



బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్ మేనేజర్‌తో మాట్లాడుతూ..

తలమడుగు, జూలై 20 : రూ.లక్ష రుణమాఫీ పథకంలో రూ.లక్ష లోపు రైతులకు బ్యాంకులో రుణం ఉన్నప్పటికీ.. రుణమాఫీ మాత్రం తక్కువ వచ్చిందంటూ ఆదిలాబాద్ జిల్లా తలమడుగు గ్రామ రైతులు శనివారం బ్యాంకుకు వచ్చిన జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్యకు ఫిర్యాదు చేశారు. తమకు రుణమాఫీ డబ్బులు తక్కువ వచ్చాయని, న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. తలమడుగులోని బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర ద్వారా తాము పంట రుణాన్ని తీసుకున్నామని తెలిపారు. రూ. 90వేల వరకు పంట రుణం తీసుకుంటే.. కేవలం 40వేల నుంచి 50వేల లోపు మాత్రమే రుణం మాఫీ అయ్యిందని తెలిపారు. తాము ఎక్కువ రుణం తీసుకున్నప్పటికీ.. రుణమాఫీలో తక్కువగా వచ్చిందన్నారు. అంతేకాకుండా బ్యాంకులో రూ.లక్ష రుణం ఉన్నప్పటికీ.. తమకు ఏమాత్రం మాఫీ కాలేదని మరికొంత మంది రైతులు వ్యవసాయాధికారి పుల్లయ్య దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతులు తీసుకున్న రూ. లక్ష లోపు రుణాలన్నీ మాఫీ అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని అధికారిని వారు వేడుకున్నారు. ఈ విషయమై స్పందించిన జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య.. జిల్లాలో గల కొంత మంది రైతులకు బ్యాంకులో ఎక్కువ రుణం ఉన్నప్పటికీ.. రుణమాఫీలో తక్కువ చ్చిందన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. బ్యాంకర్ల సహకారంతో జరిగిన తప్పులను సరిదిద్ది రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. రుణమాఫీపై ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరిగే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం తలమడుగు బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్‌తో వ్యవసాయ అధికారి పుల్లయ్య మాట్లాడి.. రుణమాఫీకి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.



శంభు సమాధి వద్ద పూజలు చేస్తున్న నాయకులు

తొలితరం ఉద్యమ నేత సిడాం శంభు

● మత్తడిగూడలో ఘన నివాళ్లర్పించిన ఆదివాసీలు

ఉట్నూర్, జూలై 20: ఆదివాసీల తొలితరం ఉద్యమనేత సిడాం శంభుకు శనివారం ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడలో ఆదివాసీలు ఘనంగా నివాళులర్పించారు. మత్తడిగూడలో ఉన్న శంభు సమాది వద్దకు గ్రామస్థులు, ఆదివాసీలు పెద్దసంఖ్యలో చేరుకుని ఆదివాసీ గిరిజనుల సంప్రదాయబద్ధంగా శంభు సమాది వద్ద ప్రజలు నిర్వహించారు. జోరుగా వర్షం కురుస్తుండడంతో మత్తడిగూడలోని శంభుపటేల్ గృహంలో సంస్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల రక్షణ కోసం శంభుదాదా అనేక ఉద్యమాలు చేశారని ఆయనక స్ఫూర్తితో ఆదివాసీల హక్కుల సంరక్షణ కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్‌బెట్టి ఎలిజిబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపకులు దుర్వ సంతోష్ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీల హక్కులే జీవితంగా భావించిన హక్కుల యోధుడు సిడాం శంభు పటేల్ అని, ఆదివాసీల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేశారని గుర్తుచేశారు. తెలంగాణ పోరాట వీరుడిగా, తుడుందెబ్బ వ్యవస్థాపకుడిగా, ఆదివాసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా ఆదివాసీల మనుగడ కోసంపోరాడి, ఆదివాసీ చట్టాల అమలు కోసం కృషిచేసిన నాయకుడు సిడాం శంభుపటేల్ అని కొనియాడారు. ప్రతీఒక్కరు ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్మన్ రాథోడ్‌జనార్దన్, బీఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జీ భుక్యజాన్సన్ నాయక్ ఉట్నూర్ మాజీ ఎంపీపీ పంద్ర జయవంత రావు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కబాపురావ్, మానవహక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, మాజీ సర్పంచ్ మరుసుకోల తిరుపతి, కనక వెంకటేశ్వర్లు, సిడాం శంభు, కుమారులు లచ్చు పటేల్, సోనేరావు, శేషు, రాయిసెంటర్ మేడి నైతం చిత్రు, నాయకులు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న కరత్వాడ ప్రాజెక్టు

బోథ్, జూలై 20: బోథ్ మండల ప్రజలకు సాగు, తాగునీరు అందించే కరత్వాడ ప్రాజెక్టు నీరులేక వెలవెలబోతోంది. అయితే, గత ఏడాది జూలై 8న ఇదే సమయానికి నిండుకుండలా మారిన ఈ ప్రాజెక్టు.. ప్రస్తుతం ఎగువన ఈ ఏడాది వర్షాలు కురవకపోవడంతో నీరురాక ప్రాజెక్టులో జలకళ కనిపించడం లేదు. దీంతో ఆయకట్టు కింద ఉన్న వివిధ పంటలు సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. వరణుడి కరుణ మున్ముందు ఉంటుందా? లేదా? అనేది రైతులు ఎదురు చూస్తున్నారు.



నీరులేక వెలవెలబోతున్న కరత్వాడ ప్రాజెక్టు

ముథోల్‌ను మున్సిపాలిటీగా చేయాలని గ్రామస్థుల డిమాండ్



ముథోల్ మేజర్ గ్రామ పంచాయతీ

ముథోల్, జూలై 20 : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్ మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు ముక్త కంఠంతో కోరుతున్నారు. ఈ మేజర్ గ్రామ పంచాయతీలో 5 వేల ఇళ్లు, 20 వేలకు పైగా జనాభా సుమారు 11 వేల ఓటర్లున్నారు. ప్రతీఏటా పన్నుల రూపంలో సుమారు రూ.30 లక్షల వరకు ఆదాయం వస్తుంది. అయితే మున్సిపాలిటీగా ముథోల్‌ను ఏర్పాటు చేసినట్లయితే ముథోల్ అభివృద్ధి చెందుతున్న ఆశ ముథోల్ గ్రామ ప్రజల్లో ఉంది. ఇంతకుముందే ముథోల్ మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని గతంలో గ్రామ పంచాయతీలో తీర్మానం సైతం చేశారు. అలాగే ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు, జిల్లా ఉన్నతాధికారులకు సైతం విన్నవించారు. కానీ నేటికీ కార్యరూపం దాల్చలేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ముథోల్ నియోజకవర్గం అంటేనే మొదట గుర్తుకు వచ్చేది ఈ నియోజకవర్గంలోని బాసర మండల కేంద్రంలోని జ్ఞాన సరస్వతి దేవి ఆలయం. అయితే ఈ ముథోల్ నియోజకవర్గంలో భైంసా మున్సిపాలిటీతో పాటు ఏడు మండలాలు ఉన్నాయి. తాజాగా ముథోల్‌ను మున్సిపాలిటీ చేయాలన్న డిమాండ్ పెద్దగా వినిపిస్తుంది. ఎన్నో రోజులుగా ముథోల్ మేజర్ గ్రామ పంచాయతీ మున్సిపాలిటీగా అవుతుందని స్థానికులు ఆశిస్తున్న అది నేటి వరకు కాలేదు. గతంలో మున్సిపాలిటీ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్ వచ్చినప్పుడు గ్రామస్తులు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు స్థానిక ప్రతినిధులు ముథోల్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలని చీఫ్ సెక్రటరీ గతంలో సూచించారు. దీంతో మరో మారు ముథోల్ మేజర్ గ్రామ పంచాయతీ మున్సిపాలిటీగా అవుతుందన్న ఆశలు చిగురించాయి.

ముథోల్ మున్సిపాలిటీగా మారితే..

ముథోల్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేసినట్లయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు పెరుగుతాయని క్రమం తప్పకుండా వచ్చే నిధులలో రూపురేఖలు మారుతాయి. పెరుగుతున్న జనాభా దృష్ట్యా భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మున్సిపాలిటీగా అప్గ్రేడ్ చేయాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. దీంతో సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్ నిర్మాణంతో పాటు విశాలమైన రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, వీధి లైట్లు తదితర అభివృద్ధి పనులు జరిగి పూర్తిగా ముథోల్ రూపు రేఖలు మారుతాయి. అయితే తాలూకా కేంద్రం మున్సిపాలిటీగా అప్డేట్ అయితే అభివృద్ధి సాధిస్తుందని ముథోల్ గ్రామ పంచాయతీ వాసులు పేర్కొంటున్నారు. ముథోల్ ఇప్పుడిప్పుడే వ్యాపార పరంగా అడుగులు వేస్తుందని చెప్పుకోవచ్చు. ఇక్కడ ముథోల్ వ్యవసాయ పరిశోధన స్థానంతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్స్ ఉన్నాయి. అలాగే ఆసుపత్రి, పెట్రోల్ బంకులు, బట్టలు, నగల దుకాణాలు, జనరల్ స్టోర్స్ కిరాణా ఇలా అన్ని వ్యాపార సముదాయాలున్నాయి. అంతేకాకుండా ముథోల్‌లోనే ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాఖ ఉండటంతో సుదూర ప్రాంతాల నుంచి ఎంతో మంది వైద్య సేవల కోసం ఇక్కడికి వస్తుంటారు.

● మున్సిపాలిటీతోనే పూర్తి అభివృద్ధి అంటున్న స్థానికులు

మున్సిపాలిటీతో సంపూర్ణ అభివృద్ధి

ముథోల్ అతిపెద్ద మేజర్ గ్రామ పంచాయతీ. ఇది మున్సిపాలిటీగా అప్గ్రేడ్ అయినట్లయితే అధిక నిధులు వస్తాయి. ముథోల్ పట్టణంలో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. వేగంగా అభివృద్ధి చెందుతుంది. అధిక జనం ఉన్నందున పూర్తిస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమగు కనీస సౌకర్యాల కల్పన అస్కారం ఉంటుంది.

\- వెంకటాపూర్ రాజేందర్, తాజా మాజీ సర్పంచ్, ముథోల్

మున్సిపాలిటీతోనే అభివృద్ధి

ఎన్నో ఏళ్ల నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే పెద్ద ముథోల్ మేజర్ గ్రామ పంచాయతీ మున్సిపాలిటీ చేయాలని పలుమార్లు అధికారులకు, నాయకులకు వేడుకుంటున్నాం. ముథోల్ మేజర్ గ్రామ పంచాయతీ కాబట్టి దీన్ని మున్సిపాలిటీగా చేసినట్లయితే ముథోల్ అభివృద్ధి చెందుతుందని మా ఆశ. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే ముథోల్ మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

\- పోతన్న యాదవ్, మాజీ ఎంపీటీసీ, ముథోల్

ప్రారంభమైన గురుపౌర్ణమి ఉత్సవాలు



కుంటాల, జూలై, 20: మండలంలోని కల్లూర్ దత్త వెంకటసాయి మందిరంలో శనివారం గురుపౌర్ణమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం సాయిబాబాకు అభిషేకం, అర్చన, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా వేడుకలు

ముథోల్, జూలై 20 : ముథోల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో శనివారం గురు పౌర్ణమి కార్యక్రమం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వ్యాస మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు రవీంద్రనాథ్, సమితి కార్యదర్శి ధర్మపురి సుదర్శన్, ప్రధారాచార్యులు పాల్గొన్నారు.

'సివిల్స్‌లో తెలంగాణ సత్తా చాటాలి'

శ్రీరాంపూర్, జూలై 20: సివిల్స్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సింగరేణి సహకారంతో 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల్లో అర్హులకు లక్ష రూపాయల వంతున ఆర్థిక సహాయం అందించే పథకాన్ని ఆయనతోపాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క హైదరాబాద్‌లో ప్రారంభించారు. తెలంగాణకు చెందిన 2023 సివిల్స్ విజేతలు, 2024మెయిన్స్ రాసే అభ్యర్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తెలంగాణ యువతలో అమోఘమైన ప్రతిభ దాగి ఉందన్నారు. అందుకే సివిల్స్‌ప్రిపేర్ అవుతున్న వారికి తాము "రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం" కింద ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. సింగరేణి సీఎండీ ఎన్ బలరాం మాట్లాడుతూ, తాను సివిల్స్ ప్రిపేర్ అయ్యే సమయంలో రూ.2వేలు లభించక ఇబ్బందులు పడ్డానని, రూ.50వేలు విలువైన పుస్తకం కొనుగోలుకు వారం రోజులు వేచి చూడాల్సిన పరిస్థితి ఉండే దన్నారు.

విద్యుత్ స్తంభాలకు కేబుల్స్ కట్టొద్దు

శ్రీరాంపూర్, జూలై 20: శ్రీరాంపూర్‌ఏరియా సింగరేణికిచెందిన కాలనీలు, గనుల ప్రాంతంలో, కంపెనీ క్వార్టర్లు, గనులకు విద్యుత్ సరఫరా చేసేందుకు వేసిన విద్యుత్ స్తంభాలకు డిష్, ఇంటర్నెట్, ఇతర తీగలు కట్టరాదని జీఎం ఒక ప్రకటనలో తెలిపారు.

వరద పరిస్థితుల దృష్ట్యా ప్రత్యేక రక్షణ చర్యలు: కలెక్టర్

ఆసిఫాబాద్, జూలై 20: వరద పరిస్థితుల దృష్ట్యా ప్రజల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం అదనపుకలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ డీవీ శ్రీఇనవాసరావుతో కలిసి జిల్లాలోని తుంపల్లి వాగును సందర్శించారు. గ్రామాల్లో వరద పరిస్థితులు, చేపట్టాల్సిన చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నదులు, కల్వర్టులు, వాగుల వద్దకు ప్రజలు వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. వరదల కారణంగా రాక పోకలకు ఇబ్బందులు ఏర్పడే గ్రామాల్లో గర్భిణులను గుర్తించి సమీప పీహెచ్‌సీలలో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల సహాయార్థం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. వరద పరిస్థితులలో సహాయంకోసం ఫోన్ నెం08733-279033, 6304686505ను సంప్రదించాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో లోకేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస రావు, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కాగజ్‌నగర్: పట్టణంలోని 30వార్డుల కోసం కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ అంజయ్య తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో అత్యవసర సహాయం కోసం సెల్‌నెంబరు 8712803804కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. తమ సిబ్బంది అందుబాటులో ఉండి సహాయం చేస్తారని పేర్కొన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.



గుడెఘాట్ వాగును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, జూలై 20: భారీవర్షాల నేపథ్యంలో జిల్లాప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలసంక్షేమంకోసం పోలీసుశాఖ ఎళ్లవేళలా అదుబాటులో ఉంటుందని అన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, రానున్న మూడురోజులు భారీ నుంచి అతిభారీవర్షాలున్న నేపథ్యంలో ప్రజలకు అనవసరంగా బయటికి రాకూడదన్నారు. వాగులు, వంకలు, నదులవైపు ఎవరుకూడా వెళ్లవద్దన్నారు. రైతులుపొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని, విద్యుత్ స్తంభాలను, వైర్లను చేతులతో తాకరాదన్నారు. ప్రాణహిత పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలు, యవకులు నది, జలాశయాల వద్ద సెల్ఫీలు, తీసుకోవడం, ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. ఎవరైనా ప్రమాదంలో చిక్కు కుంటే వెంటనే 100కు లేదా దగ్గర్లోని పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడానికి డిజాస్టర్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని, అత్యవసర పరిస్థితి ఏర్పడితే పోలీసులను సంప్రదించాలన్నారు.

మహిళా శక్తి పథకం ద్వారా ఆర్థికాభివృద్ధికి చేయూత


ఆసిఫాబాద్, జూలై 20: ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత అందిస్తామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐకేపీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా శక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా క్యాంటీన్‌లతోపాటు స్త్రీనిధి లింకేజ్, బ్యాంకు లింకేజ్, వాటర్‌షెడ్‌ల ద్వారా నిధులు సమకూర్చి మహిళలు ఆర్థకంగా ఎదిగేందుకు రుణసదు పాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపుజిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ,తహసీల్దార్ తిరుపతి, ఏపీఎం సుజాత, శ్రీనివాస్, ఎంపీవో శివకుమార్, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులను ముందే ఆసుపత్రిలో చేర్చుకోవాలి

జైనూర్ : వర్షాలు పడుతున్నందున గర్భిణులను ముందే ఆసుపత్రిలో చేర్చుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి కోరారు. స్థానిక 30పడకల ఆసుపత్రిని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రక్త పరీక్షల గదిని పరిశీలించారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని సూచించారు. అనంతరం ఐకేపీ కార్యాలయాన్ని సందర్శించి స్వయం సహా య సంఘాలతో సమావేశ అయ్యారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక స్వాలంబన చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రుణాలను పంపిణీ చేశారు. గణేష్ నగర్ ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి తుకారాం భట్, డీసీహెచ్ చెన్నకేశవ్, వైద్యాధికారి అశోక్, హెల్త్ సూపర్‌వైజర్ పవార్ దిలీప్, సీడీపీవో ఇందీర, సూపర్ వైజర్ పింటుబాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లో లెవల్ వంతెనలను పరిశీలన

కెరమెరి: లోలె వల్ వంతెనను శనివారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 26.5 కనిష్ఠం 23.2

నిర్మల్
జిల్లా వార్తలు
8
ఆదివారం 21 జూలై 2024



ఆ నేతదే పెత్తనం

- జిల్లాలో చక్రం తిప్పుతున్న పొరుగు జిల్లా అధికార పార్టీ నేత
- మొన్నటి లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జీగా గుర్తింపు
- ఓ మంత్రి అండదండలతో స్థానిక నేతలపై పెత్తనం
- సీనియర్‌లను లెక్క చేయని వైనం
- నామినేటెడ్ పోస్టుల్లో సైతం ఈ నేత జోక్యం
- ఈయన చెప్పిన వారికే పదవులంటూ ప్రచారం

నిర్మల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పొరుగు జిల్లాకు చెందిన అధికార కాంగ్రెస్ పార్టీ నేత ఒకరు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పరోక్షంగా చక్రం తిప్పుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. సదరు నేతకు ఓ మంత్రి అండదండలు పుష్కలంగా ఉండడమే కాకుండా ఆ మంత్రి అనుచరునిగా చెప్పుకుంటూ ఈ నేత జిల్లాకు చెందిన స్థానికనేతలపై పెత్తనం చెలాయిస్తున్నారంటున్నారు. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి కూడా ఈ నేతనే ఇన్‌చార్జీగా వ్యవహరించారంటున్నారు. ఆ సమయంలో కూడా ఆయన స్థానిక కాంగ్రెస్ నేతలను పట్టించుకోకుండా ఆయనకున్న పరిచయస్తులతోనే ఎక్కువగా కార్యకలాపాలు సాగించి అంతా తానై వ్యవహరించారని అంటున్నారు. ఈ నేత కారణంగా స్థానిక నేతలు అసహనానికి గురి కాగా కార్యకర్తలు గందరగోళానికి లోనయ్యారంటున్నారు. ఎన్నికలు ముగిసిన తరువాత కూడా ఈ నేత జిల్లా రాజకీయాల్లో జోక్యం చేసుకుంటూ షాడోనేతగా కొనసాగుతున్నారంటున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని నాలుగు జిల్లాలకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలతో ఎమ్మెల్యేలను సైతం ఈయన పట్టించుకోకుండా మంత్రి అండతో తాను చెప్పిందే వేదమని ప్రచారం చేసుకుంటున్నారంటున్నారు. రోజు రోజుకు ఆయన పెత్తనం ఆధిపత్యం పెరిగిపోతున్న కారణంగా ద్వితీయ శ్రేణి నేతలు నామినేటేడ్ పోస్టుల కోసం ఆయన చుట్టే ప్రదక్షణలు చేస్తున్నారంటున్నారు. అయితే నామినేటేడ్ పోస్టులతో పాటు జిల్లాలో జరిగే వ్యాపార లావాదేవీల్లో సైతం ఆయన పరోక్షంగా పాలు పంచుకుంటూ పెద్దఎత్తున పైరవీలు చేస్తున్నారంటున్నారు. అధికారులపై కూడా ఆయన ఒత్తిళ్లు తీసుకువస్తున్నారని తన మాట వినని అధికారులకు మంత్రి పీఏ ద్వారా ఫోన్‌లు చేయించి ఒత్తిడి పెంచుతున్నారంటున్నారు. అయితే ఇలాంటి వ్యవహారాల్లో సదరు షాడోలీడర్ లక్షల రూపాయల వసూళ్లకు కూడా పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. రోజురోజుకు ఈ షాడో లీడర్ ఆగడాలు పెరిగిపోవడంతో ఆయా నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలు నేరుగా సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారంటున్నారు. కష్టకాలంలో పనిచేసిన కార్యకర్తలను పక్కన పెట్టి ఇటీవల పార్టీలో చేరిన ఇతర పార్టీల నేతలను ఈ షాడో లీడర్ చేరదీసి అన్ని వారికే అప్పజెప్పుతున్నారంటున్నారు. ఈ లీడర్ వ్యవహారం కారణంగా జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అయోమయానికి లోనవుతున్నారంటున్నారు. ప్రస్తుతం ఈ షాడో లీడర్ పేరు చెబితేనే నియోజకవర్గాల ఇన్‌చార్జీలు సైతం జడుసుకుంటున్నారంటున్నారు. కాగా నామినేటెడ్ పోస్టుల వ్యవహారం ప్రస్తుతం ఆ పార్టీలో కీలకంగా మారిన నేపథ్యంలో ఈ షాడో లీడర్ దీనిని అవకాశంగా మలుచుకుంటూ పదవుల పేరిట జూనియర్ నేతలకు వల విసురుతూ వారి నుంచి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నాడంటున్నారు.

మంత్రి అండదండల పేరుతో..

కాగా పొరుగు జిల్లాకు చెందిన సదరు నేత టీపీసీసీ బాధ్యునిగా జిల్లా రాజకీయాల్లోకి రంగప్రవేశం చేశారంటున్నారు. మొన్నటి లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఇన్‌చార్జీగా ఆయనకు పార్టీ అధిష్టానం విధులు అప్పజెప్పింది. ఓ మంత్రికి ఈయన అత్యంత సన్నిహితుడు కావడంతోనే ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యవహారాన్ని అనుకూలంగా మలుచుకున్న షాడో లీడర్ క్రమంగా లోక్‌సభ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో తన ఆధిపత్యాన్ని ప్రదర్శించడం మొదలు పెట్టారంటున్నారు. ముఖ్యంగా ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, ఎమ్మెల్యేలను సైతం ఈయన మంత్రి అండదండలతో శాసించే స్థాయికి చేరుకున్నారని పేర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో అధిష్టానం సైతం కీలక బాధ్యతలు అన్ని ఈయనకే అప్పగించడంతో నేతలు, కార్యకర్తల్లో ఈ షాడో లీడర్ ప్రాధాన్యత పెరిగిందని అంటున్నారు. ప్రచారంతో పాటు ఇతర అంశాలపై కూడా ఇన్‌చార్జీలు ఈ షాడో లీడర్‌పైనే ఆధారపడి తమ కార్యకలాపాలను కొనసాగించారని అంటున్నారు. ఈ పరిణామాలను గమనించిన ద్వితీయ శ్రేణి నాయకులు, సీనియర్ కార్యకర్తలంతా ఆయనకు టచ్‌లోకి వచ్చి తమ ప్రాబల్యం పెంచుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. క్రమక్రమంగా ఈ లీడర్ స్థానిక రాజకీయ పరిస్థితులను, ఇక్కడి నేతల బలహీనతలను తెలుసుకొని అంతా తనను అనుకూలంగా మలుచుకున్నాడని అంటున్నారు. తనకు విలువనివ్వని నాయకులను పక్కన పెట్టే ప్రయత్నం కూడా చేశారంటున్నారు. ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ పార్టీలో ఈ షాడో లీడర్ కార్యకలాపాలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోందంటున్నారు.

నామినేటెడ్ పదవుల్లో సైతం..

కాగా సదరు షాడోలీడర్ నామినేటెడ్ పోస్టుల కేటాయింపుల్లో కూడా చక్రం తిప్పుతున్నాడని అంటున్నారు. దేవాలయాల పాలకవర్గాలు, మార్కెట్ కమిటీ పదవులు, గ్రంథాలయాల సంస్థ పదవుల కేటాయింపులు జరుగుతున్న నేపథ్యంలో ఈ షాడో లీడర్ దీనిని తనకు అనుకూలంగా మలుచుకున్నాడని అంటున్నారు. ఇప్పటికే జిల్లాలో ఆయన గుర్తింపు పొందిన కారణంగా మంత్రి అండదండలతో తాను నామినేటేడ్ పోస్టులు ఇప్పిస్తానంటూ ఆశావాహులకు వల విసురుతున్నాడని చెబుతున్నారు. ఈ వ్యవహారంలో సదరు షాడో లీడర్ లక్షల రూపాయల వసూళ్ళకు పాల్పడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సీఎం సీరియస్..

కాగా గత కొద్దిరోజుల నుంచి జిల్లా కాంగ్రెస్ పార్టీలో పరోక్షంగా చిచ్చు పెడుతూ వసూళ్లకు పాల్పడుతున్న ఈ నీడనాయకుడి వ్యవహారంపై ఆయా నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జీలు, ఓ ఎమ్మెల్యే నేరుగా సీఎంకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈయనకు పరోక్షంగా అండగా నిలుస్తున్న మంత్రికి సైతం ఇప్పటికే ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం కనిపించకపోవడంతో జిల్లా నేతలు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ వ్యవహారాన్ని తీసుకువెళ్లినట్లు చెబుతున్నారు. ఈ లీడర్ వసూళ్ల పర్వంతో పాటు పార్టీని గందరగోళానికి గురి చేస్తున్న వ్యవహారం తమకు నష్టం చేకూరుస్తుందని రాబోయే స్థానిక ఎన్నికలపై కూడా ఈ ప్రభావం ఉంటుందంటూ జిల్లా నేతలు సీఎంకు వివరించినట్లు చెబుతున్నారు. అయితే జిల్లానేతల ఫిర్యాదుతో సీఎం సైతం సీరియస్‌గా స్పందించి సదరు నేత కార్యకలాపాలకు అడ్డు వేయాలని అలాగే జిల్లా కాంగ్రెస్ కార్యకలాపాల్లో జోక్యం చేసుకోకుండా చూడాలంటూ ఓ రాష్ట్రస్థాయి నేతకు సూచించినట్లు సమాచారం. రెండు మూడు రోజుల్లో ఈ లీడర్ కార్యకలాపాలకు బ్రేక్ పడబోతుండడమే కాకుండా ఇతన్ని వసూళ్ళ పర్వం కూడా వెలుగులోకి రాబోతోందని అంటున్నారు.

ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్



ఈవీఎం కేంద్రంలో కలెక్టర్ తనిఖీ

నిర్మల్ కల్చరల్, జూలై 20 : కలెక్టరేట్ కార్యాలయ సమీపంలోని ఈవీఎం కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ ఆమె వెంట ఉన్నారు. పలు రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు ఇవే..

నిర్మల్ కల్చరల్, జూలై 20 : 11 కేవీ నిర్మల్ పట్టణం 1 ఫీడర్, కలెక్టర్ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 వరకు ఉండదు. ఆ ప్రాంతాలు చింతకుంట వాడ, పాత బస్టాండ్, పింజారిగుట్ట, బుధవార్‌పేట్, కలెక్టర్ క్యాంపు ఆఫీసర్, డీఎస్పీ కార్యాలయ ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

బాసర ఆలయ ఈవో బదిలీ

- నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియామకం
- బాసర సరస్వతీ దేవాలయ ఇన్‌చార్జీగా అదనపు బాధ్యతలు

బాసర, జూలై 20 : బాసర సరస్వతి అమ్మవారి దేవస్థాన ఈవో విజయ రామారావు బదిలీ అయినట్లు సమాచారం. శనివారం రాత్రి దేవాదాయ శాఖ చేపట్టిన ఆలయాల ఈవోల బదిలీల్లో బాసర ఆలయ ఈవో కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. గత రెండేళ్ల నుంచి ఆలయ ఈవోగా పనిచేస్తున్న విజయరామరావును పొరుగన ఉన్న నిజామాబాద్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా నియమితులయ్యారు. బాసర ఆలయానికి కొత్త ఈవో నియామకం జరిగే వరకు నిజామాబాద్ జిల్లా ఈసీగా పనిచేయనున్న విజయరామారావుకే అదనపు బాధ్యతలు అప్పగించారు.

పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమే



మాట్లాడుతున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం సదానందం

దిలావర్‌పూర్, జూలై 20 : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమేనని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సదానందం అన్నారు. దిలావర్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసినా తల్లిదండ్రుల సహకారం లేనిది ప్రయోజనం లేదన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను ఇంటి వద్ద విద్యార్థులు చదువుకునేలా చూడాలన్నారు. పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వాలని అయితే అధికాస్త అదుపు తప్పకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. పిల్లలు బాగా చదివి భవిష్యత్‌లో ప్రయోజకులు అయ్యేందుకు బాట వేయాల్సింది ఉపా.ద్యాయులు, తల్లిదండ్రులేనన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు క్రమశిక్షణ గల విద్యార్థులుగా చదువులో, ఆట పాటల్లో రాణించేందుకు ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోషకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత



కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్న దృశ్యం

ఖానాపూర్, జూలై 20 : ఎగువన భారీగా వర్షాలు కురుస్తుండడంతో అధికారులు శనివారం సాయంత్రం కడెం ప్రాజెక్టు మూడు వరద గేట్లను ఎత్తారు. ఎగువ ప్రాంతం నుండి 15,338 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు మూడు వరద గేట్లను ఎత్తి దిగువకు 11,022 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. కడెం ప్రాజెక్టులో నీటిమట్టం క్రమేపి పెరుగుతుండడంతో ప్రాజెక్టు వద్ద పరిస్థితిని సీఈ శ్రీనివాస్, ఈఈ రాథోడ్ విఠల్, సహా స్థానిక ఇంజనీర్ల బృందం అధికారులు పరిస్థితిని సమీక్షించారు. ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తుండడంతో కడెం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు భారీ వర్షం కురవడంతో కడెం ప్రాజెక్టులో క్రమేపి నీటిమట్టం పెరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో గేట్లు ఎత్తినందున నదీ పరివాహక ప్రాంతాల్లోకి మత్స్యకారులు, పశువుల కాపర్లు ఎవరు వెళ్లవద్దని అధికారులు హెచ్చరిక జారీ చేశారు. కాగా కడెం ప్రాజెక్టు క్రమేపి జలకలను సంతరించుకుంటున్న నేపథ్యంలో ప్రస్తుత వర్షాకాల పంట కోసం స్థానిక ఎమ్మెల్యే బొజ్జు చేతుల మీదుగా ఆదివారం ఆయకట్టుకు నీటి విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఈఈ రాథోడ్ విఠల్ తెలిపారు.

ఎడతెరిపి లేని వర్షం...



భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో నిండుకుండలా దర్శనమిస్తున్న కడెం ప్రాజెక్టు

మండలంలో శనివారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి నుండి శనివారం సాయత్రం వరకు ఎడతెరిపిలేని వర్షం కురుస్తుండడంతో ఇంట్లోంచి బయటకు వెళ్లేందుకు జనం ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల పంటలు నీట మునిగాయి. ఈ ఏడాది తొలిసారి ఎట్టకేలకు వాగులు, ఒర్రెలు కదిలాయి.

భారీ వర్షాలు కురుస్తున్నాయి.. అప్రమత్తంగా ఉండాలి



రంగారావు పల్సికర్ ప్రాజెక్టు పరిశీలిస్తున్న సీఐ నైలు

భైంసా రూరల్, జూలై 20 : మండలంలోని గుండెగాం గ్రామంలో ఉన్న రంగారావు పల్సికర్ ప్రాజెక్టు నీటి ప్రవాహాన్ని సీఐ నైలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వర్షాలు నిరంతరం కురుస్తుండడంతో గుండెగాం ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని తెలిపారు. ప్రజారక్షణ కొరకై అధికార యంత్రం ఎల్లవేళలా అందు బాటులో ఉంటామన్నారు. ప్రజలు వర్షాల వలన ఆందోళన పడవద్దని, అత్యవసర సమయంలో అధికారులకు సంప్రదించాలన్నారు. తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటామన్నారు.

అనుక్షణం ప్రజలకు అందుబాటులో మీ పోలీసు

- భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంకండి
- తక్షణ సహాయం కోసం డయల్ 100
- ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, జూలై 20 : భారీ వర్షాల దృష్ట్యా ప్రజలను అనుక్షణం ఆదుకునేందుకు పోలీసులు అందుబాటులో ఉంటారని జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. శనివారం ఎస్పీ ఓ ప్రకటన విడుదల చేస్తూ విపత్కర సమయంలో సహాయం కోసం నిర్మల్ పోలీసు - మీ పోలీసులు 24/7 అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. సహాయం కోసం 100 నంబర్‌కు డయల్ చేసినా, సమీప పోలీసులకు సమాచారం అందించినా తక్షణ సహాయక చర్యలు చేపడతారన్నారు. జిల్లాలో రాగల 48 గంటలపాటు భారీ వర్ష సూచన ఉన్నందున పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్టు వివరించారు. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. ఎవరైనా ఆపదలో ఉన్నట్లయితే పోలీసు కంట్రోల్ రూమ్ 8712659555కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చునన్నారు. అధికారుల సూచనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా స్వర్ణ, కడెం ప్రాజెక్టు, గడ్డెన్నవాగు ప్రాజెక్టు పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున ప్రజల భద్రత దృష్ట్యా వాటి వద్దకు వెళ్లవద్దని స్పష్టం చేశారు. మత్స్యకారులు, ప్రజలు జలాశయాలు, చెరువుల, ప్రాజెక్టులు, వాగుల వద్ద చేపలు పట్టేందుకు వెళ్లరాదన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో చెరువులు, కుంటలు, అలుగుల వద్ద రహదారులపైనా నీరు ప్రవాహాన్ని గుర్తించి ప్రత్యక్షంగా వెళ్లి పర్యవేక్షించాలని పోలీసు అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలని, నీరు ప్రవహిస్తున్నప్పుడు దాటరాదన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒకరు మొక్కలు నాటి సంరక్షించాలి



భైంసా కోర్టు అవరణలో మొక్కలు నాటుతున్న సీనియర్ న్యాయాధికారి

- జిల్లా న్యాయాధికారి ఎ.కర్ణకుమార్

భైంసా, జూలై 20 : వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతలు చేపట్టాలని జిల్లా న్యాయాధికారి ఎ.కర్ణకుమార్ పిలుపునిచ్చారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం భైంసా కోర్టు అవరణలో జిల్లా సీనియర్ జడ్జీ జి.రాధిక, జూనియర్ న్యాయాధికారి దేవేంద్రబాబు, భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జీ ఎ.కర్ణకుమార్ మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా అవి చెట్లు ఎదిగేంత వరకు సంరక్షించాలన్నారు. పచ్చదనం పరిఢవిల్లితే అన్ని విధాలుగా ప్రయోజనకరమన్నారు. ఇందులో భైంసా టౌన్ సీఐ రాజారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సి.శంకర్, కోర్టు సిబ్బంది, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

ముథోల్, జూలై 20 : మండలంలోని ఆయా గ్రామాల్లో గల రైతులు జూన్ 24, 2024 లోపు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం వచ్చినవారు, ఇంతకు ముందు రైతుబీమా చేసుకోని రైతులు ఈ సంవత్సరం రైతు భీమా చేసు కోవడానికి అవకాశం ఉందని ఏవో అజ్మీరాభాస్కర్ ఒక ప్రకటనలో తెలి పారు. సంబంధిత రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునే రైతులు ఆధార్ కార్డులో 14 ఆగస్టు 1965 నుండి 14 ఆగస్టు 2006 మధ్యలో పుట్టిన రైతులు మాత్రమే అంటే 18 నుండి 59 ఉన్నవారు ఈ రైతు బీమాకు అర్హులన్నారు. రైతులు స్వయంగా వచ్చి నామినేషన్ ఫారం మీద సంతకం చేసి భూమి పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్, సమీప వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో)కి అందజేయాలని కోరారు.

పాఠశాలలో వైద్య శిబిరం



సారంగాపూర్, జూలై 20 : మండలంలోని చించోలి(బి)లో గల ప్రభుత్వ పాఠశాలలో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో వైద్యులు రాజశేఖర్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం 14 సంవత్సరాలు నిండిన విద్యార్థులందరూ రక్తదాతలుగా పేర్లను నమోదు చేసుకున్నారు. వ్యాధిగ్రస్తులకు అత్యవసర సమయంలో రక్తదాతలుగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ వైద్య శిబిరం కార్యక్రమంలో ఎంఈవో మధుసూదన్, ప్రధానోపాధ్యాయుడు రమేష్‌లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించండి : ఎస్టీయూ

నిర్మల్ కల్చరల్, జూలై 20 : పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను వెంటనే నియమించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్. భూమన్న యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులైనా ఇప్పటి వరకు కార్మికులను నియమించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. బదిలీలు, పదోన్నతుల వల్ల ఏర్పడ్డ ఖాళీలను వాలంటీర్లతో భర్తీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, జీఎల్ఐసీ, మెడికల్ తదితర బిల్లులు చెల్లించాలన్నారు. 40 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించారు. ఇతర విద్యారంగ సమస్యలపై పోరాటాలు నిరంతరం చేస్తామని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శి జే. లక్ష్మణ్, నాయకులు వెంకటేశ్వర్ రావు, లక్ష్మీనారాయణ, ఇంతియాజ్, డేవిడ్ గంగన్న, శివలింగయ్య పాల్గొన్నారు. సభ్యత్వ సేకరణ ప్రారంభించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



తానూర్, జూలై 20 : మండల వైస్ ఎంపీపీ జెల్లావార్ చంద్ర కాంత్ తండ్రి గంగాధర్ ఇటీవల మృతి చెందాడు. కాగా శనివారం మండలంలోని బోల్సా గ్రామంలో మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపటేల్ వైస్ ఎంపీపీ జెల్లావార్ చంద్ర కాంత్,వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పుండ్లిక్, నాయకులు గోవిందరావుపటేల్, మారుతిపటేల్, అటల్ దేవిదాస్, తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

జిల్లాలో జోరువాన

నిర్మల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు సైతం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 4.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టులన్నీ క్రమేపి జలకలను సంతరించుకుంటున్నాయి. స్వర్ణప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1183 అడుగులు కాగా ప్రస్తుతం 1174.1 అడుగులకు చేరింది. నీటినిలువ సామర్థ్యం 1.484 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.715 టీఎంసీలకు చేరింది. గడిచిన 24 గంటల్లో ప్రాజెక్టుకి 550 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా ప్రస్తుతం 355.80 మీటర్లకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిలువ సామర్థ్యం 1.852 టీఎంసీలుగా కాగా ప్రస్తుతం 0.704 టీఎంసీలకు చేరింది. గడిచిన 24 గంటల్లో గడ్డెన్న వాగు ప్రాజెక్టులోకి ఎటువంటి వరద నీరు రాలేదని అధికారులు చెబుతున్నారు. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700ల అడుగులు కాగా ప్రస్తుతం 689.875 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 5.237 టీఎంసీలకు నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎగువన వర్షాలు భారీగా కురుస్తున్న నేపథ్యంలో ప్రాజెక్టులోకి ప్రస్తుతం 5000ల క్యూసెక్కులకు పైగా వరద నీరు వచ్చి చేరుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నేడు గురు పౌర్ణమి

ముథోల్, జూలై 20 : గురువులను, ఉపాధ్యాయులను, పెద్దలను పూజించే రోజును గురుపౌర్ణమి, వ్యాస పౌర్ణమి అని అంటారు. ఆది గురువైన వేద వ్యాసుడు అసలు పేరు కృష్ణ ద్వైపాయనుడు. వేదాలను నాలుగు భాగాలుగా విభజించి వేద వ్యాసుడయ్యాడు. వేదాలతో పాటు మహాభారతం, భాగవతం, అష్టాదశ పురాణాలు రచించాడు వ్యాసుడు. ఆయన అందించిన ఆధ్యాత్మిక వారసత్వం కారణంగానే వ్యాసుడిని ఆది గురువుగా కొలుస్తారు. వ్యాసుడి పుట్టిన రోజైన ఆషాడ పౌర్ణమిని గురుపౌర్ణమిగా, వ్యాసపౌర్ణమిగా జరుపుకుంటూ తమ గురువులను పూజించి వారి ఆశీస్సులు తీసుకుంటారు. మనిషి పుట్టినప్పటి నుంచి మరణించే దాకా ప్రతిక్షణం ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకుంటూనే ఉంటాడు. అతడు నేర్చుకునే ప్రతి అంశం వెనుక గుప్తంగా ఒక గురువు దాగి ఉంటాడు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కలగలసిన రూపం గురువు. అందుకే మాతృదేవోభ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అన్నారు. అంటే తల్లిదండ్రుల తర్వాత అంతటి స్థానాన్ని పొందేది గురువే. గురువును బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూపంగా పూజించే ఉత్కృష్టమైన సంస్కృతి మనది. 'గు' అంటే అంధకారం చీకటి అని అర్థం. 'రు' అంటే తొలగించడం అని అర్థం. అజ్ఞానమనే గురు పరంపరలకు అలవాలం మన భారతదేశం. ఆషాడ శుద్ధ పౌర్ణమిని గురుపౌర్ణమి, వ్యాసపౌర్ణమి అని అంటారు. ఈ రోజున గురుపూజోత్సవం జరిపి గురువులకు కానుకలు, బహుమతులు సమర్పించి వారిని సత్కరించి వారి ఆశీర్వాదములు తీసుకుంటారు. తమ జీవితానికి మార్గనిర్దేశం చేసి, ముక్తి వైపు నడిపించినందుకు ప్రతిఫలంగా ఇలా చేస్తారు. గురు వు అంటే ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించేవాడు. గురువును ఈ పౌర్ణమి రోజు పూజించి వారి చేత దీవెనలు పొందుతారు.